సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 6 | జూలై | 2024



జునోసిస్ వ్యాధులతో జాగ్రత్త
జంతువులను పెంచుకునేవారు వాటి వల్ల వచ్చే వ్యాధుల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరంఉంది. 8లో



'గూడెం' చుట్టూ ఔటర్..
జిల్లా కేంద్రమైన కొత్తగూడేనికి ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు నేషనల్ హైవే అధికారులు ప్రతిపాదనలు పంపించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 25°

వాతావరణం
జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారుడైన రామయ్య

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతిని సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు

బాధితులకు సత్వర న్యాయం అందించాలి



కేసుల వివరాలపై ఆరా తీస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

సుజాతనగర్: ఆయా కేసుల్లో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శుక్రవారం ఆయన సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పలు కేసుల వివరాలను ఎస్సై జుబేదా బేగంను అడిగి తెలుసుకున్నారు. కేసులను సమగ్రంగా విచారించి, బాధ్యతగా వ్యవహరించాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సిబ్బంది వర్టికల్స్ వారీగా విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సై జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

పలువురు ఎస్‌ఐల బదిలీలు

కొత్తగూడెంటౌన్: జిల్లా వ్యాప్తంగా పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ శుక్రవారం పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. ఇ.రాజేష్‌ను కొత్తగూడెం టూటౌన్ నుంచి బూర్గంపాడు ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. ఈ.రాజ్‌కుమార్‌ను సీసీఎస్–2 నుంచి ఏడూళ్లబయ్యారం ఎస్‌హెచ్‌ఓగా, బూర్గంపాడు ఎస్‌ఐ కె. సుమన్‌ను సీసీఎస్–2 ఎస్‌ఐగా, ములకలపల్లి ఎస్‌హెచ్‌ఓ ఎం.రాజమౌళిని గుండాల ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. బి.రంజిత్‌ను మణుగూరు ఎస్‌ఐగా, ఏడూళ్లబయ్యారం ఎస్‌హెచ్‌ఓ టి.వెంకటప్పయ్యను దుమ్ముగూడేనికి బదిలీ చేశారు. దుమ్ముగూడెం ఎస్‌ఐ పి.కేశవరావును వీఆర్ కొత్తగూడేనికి, గుండాల ఎస్‌హెచ్‌ఓ కె.రాజశేఖర్‌ను ములకలపల్లి ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వరద వచ్చినా ఇబ్బంది లేకుండా..



వర్క్‌షాప్ దగ్గర ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలు

దుమ్ముగూడెం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద కొద్దికొద్దిగా పెరుగుతోంది. ఈ నేపథ్యాన వరద మరింత పెరిగినా ఇబ్బంది లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా దుమ్ముగూడెంలోని మూడు తూములు, వర్క్‌షాప్‌లోని హెడ్ లాక్‌ల వద్ద ముందస్తు చర్యల్లో భాగంగా ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. ఇరిగేషన్ జేఈ రాజ్‌సుహాస్, పీటీ మస్తాన్‌వలీ ఆధ్వర్యాన గోదావరి వరదతో లీక్ అయ్యే కరకట్ట దగ్గర ఇసుక బస్తాలు అమర్చారు. అలాగే, దుమ్ముగూడెంలోని స్లూయిస్‌ల దగ్గర కూడా ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు చేపట్టారు.

రాజస్థాన్‌లోకి సింగరేణి..



సింగరేణి ప్రధాన కార్యాలయం

సరిహద్దులు చెరిపేస్తున్న సంస్థ!
- ఇప్పటికే ఒడిశాలో బొగ్గు ఉత్పత్తికి చర్యలు
- థర్మల్, సోలార్ విద్యుదుత్పత్తిలో సానుకూల ఫలితాలు
- త్వరలో రాజస్థాన్‌లోనూ సింగరేణి 'సౌర' వెలుగులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తిలో తెలంగాణ ప్రాంతానికే పరిమితమైన సింగరేణి సంస్థ క్రమంగా సరిహద్దులు చెరిపేస్తోంది. బొగ్గు ఉత్పత్తి నుంచి థర్మల్ విద్యుదుత్పత్తిలోకి అడుగు పెట్టింది. తెలంగాణ దాటి ఒడిశాలో బొగ్గు ఉత్పత్తికి చర్యలు చేపట్టింది. ఇదే ఊపులో ఇప్పుడు రాజస్థాన్‌లో కార్యకలాపాలు మొదలుపెటనుంది.

ఒడిశాలో బొగ్గుతోపాటు థర్మల్ ప్లాంట్
దక్షిణ భారత దేశంలో బొగ్గు ఉత్పత్తి చేసే ఏకైక సంస్థగా సింగరేణి ఉండగా మిగిలిన దేశం అంతటా కోలిండియా పరిధిలో వివిధ సంస్థలు బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాయి. గత చరిత్రను తిరగ రాస్తూ మారిన పరిస్థితులకు తగ్గట్టుగా తెలంగాణ సరిహద్దులు దాటి ఒడిశాలో బొగ్గు ఉత్పత్తికి సింగరేణి చేస్తున్న ప్రయత్నాలు తుది దశకు వచ్చాయి. ఒడిశాలో నైనీ, మహాపాత్ర బొగ్గు బ్లాకులు 2018లో సింగరేణికి దాఖలు పడగా రాబోయే మూడు నెలల్లో నైనీ నుంచి బొగ్గు ఉత్పత్తి కానుంది. ఇక్కడ సాలీనా పది మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ గనులకు అనుసంధానంగా 1,200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌కు యాక్షన్ ప్లాన్ రెడీ చేసింది.

రాజస్థాన్‌లో 500 మెగావాట్లు
సంప్రదాయేతర విద్యుత్‌ను ప్రోత్సహించడంలో భాగంగా బికనేర్, ఫలోడి జిల్లాల్లో సోలార్ పార్కులను రాజస్థాన్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే ఎన్టీపీసీతోపాటు అనేక ప్రైవేటు కంపెనీలు సోలార్ ప్రాజెక్టులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఈ క్రమంలో ఇక్కడ 500 మెగావాట్ల సామర్థ్యంలో సోలార్ పవర్ ప్లాంట్‌ను స్థాపించేందుకు సింగరేణి సంస్థ పలు దఫాలుగా చర్చలు జరపగా, రాజస్థాన్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. దీంతో సింగరేణి పూర్తిస్థాయి ప్రణాళికను రెడీ చేసి పనిలో ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం సుమారు రూ. 2000 కోట్ల వరకు అవుతుందని అంచనాలు ఉన్నాయి.

తొలి అడుగు థర్మల్..
వందేళ్ల పైబడిన చరిత్ర సింగరేణి సొంతం. సుమారు నూట పాతిక సంవత్సరాలు ప్రధానంగా బొగ్గు ఉత్పత్తికే ఈ సంస్థ పరిమితమైంది. కానీ తన పంథా మార్చుకుంటూ మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 1,200 మెగావాట్ల సామర్థ్యంతో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపీపీ) నిర్మాణానికి 2012లో శ్రీకారం చుట్టింది. ఎస్‌టీపీపీ 2016 నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభించింది. అనతి కాలంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తింపు పొందింది. దీంతో ఆ వెంటనే సోలార్ విద్యుదుత్పత్తిలోకి అడుగు పెట్టి ప్రయోగాత్మకంగా సంస్థ విస్తరించిన తొమ్మిది ఏరియాల్లో సోలార్ 235 మెగావాట్ల సామర్థ్యంతో పవర్ ప్లాంట్లు నెలకొల్పింది. ఇక్కడ కూడా అంచనాలకు మించి ఫలితాలు రావడంతో ఇప్పుడా సామర్థ్యాన్ని 500 మెగావాట్లకు పెంచుతోంది.

5,800 మెగావాట్లు
రాబోయే రోజుల్లో సింగరేణి అంటే బొగ్గు రంగంలో కంటే విద్యుత్ రంగంలో ప్రముఖ సంస్థగా వెలుగొందే అవకాశం ఉంది. ఇప్పటికే సంస్థ 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ 235 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి చేస్తోంది. వీటికి అదనంగా జైపూర్‌లో 800 మెగావాట్లు, రామగుండంలో 1,600 మెగావాట్లు, నైనీలో 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌కు ప్రణాళిక రెడీ చేసింది. ప్రస్తుతం ఉన్న 235 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను 500 మెగావాట్లకు పెంచడంతోపాటు రాజస్థాన్‌లో 500 మెగావాట్లకు ప్లాన్ రెడీ అవుతోంది. మొత్తంగా రాబోయే నాలుగైదేళ్లలో సింగరేణి సంస్థ 4,800 మెగావాట్ల థర్మల్, 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్.. మొత్తం 5,800 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయబోతోంది. మరోవైపు ఇల్లెందులో ప్రయోగాత్మకంగా పంప్‌డ్ స్టోరేజీ హైడల్ పవర్ ప్లాంట్ అంశం పరిశీలనలో ఉంది.

గుండాల అభివృద్ధిపై దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- ఎన్‌క్వాస్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి నిధులు
- సంపూర్ణత అభియాన్ ప్రారంభంలో కలెక్టర్ జితేష్ పాటిల్



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

గుండాల: ఆస్పిరేషన్ బ్లాక్‌లో ఎంపికైన గుండాల మండలాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన ప్రభుత్వాస్పత్రిలో నీతి ఆయోగ్‌లో భాగంగా సంపూర్ణతా అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వాస్పత్రి అప్‌గ్రేడ్ అయ్యేలా జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు(ఎన్‌క్యూఎస్)లో పెడతామన్నారు.

తల్లీబిడ్డలు క్షేమంగా ఉండాలి..
గర్భిణులు యాంటినెటల్ కిట్(ఏఎన్‌సి)లో వివరాలు నమోదు చేయించుకోవాలని, టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండేలా వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. 30 ఏళ్ల పైబడిన వారికి మధుమేహం, రక్త పరీక్షలు చేయించాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు అనుబంధ పోషకాహారం అందించాలని, రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు, స్వయం శక్తి సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ ఇవ్వాలని వివరించారు. వీటిపై సంపూర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, రోడ్లకు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తి చేయాలని, గిరిజన గ్రామాల్లో సమస్యలతో ఎవరూ ఇబ్బందులు పడరాదని సూచించారు. మండలాధికారులు గ్రామాలను సందర్శించాలని, గ్రామసభలు నిర్వహించాలని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి హామీ
అనంతరం ఎంపీపీ ముక్తి సత్యం మండలంలోని సమస్యలను వివరించగా, పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇటీవల పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలతోపాటు, షీల్డ్ అందించారు. కాచనపల్లి క్రీడా పాఠశాలను విజిట్ చేసి, విద్యార్థుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. మెనూ అందించాలని సూచించారు. క్రీడా సామగ్రి ఇస్తామన్నారు. తొలుత ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. సంపూర్ణతా అభియాన్‌పై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో విద్యార్థులు, అంగన్‌వాడీలు, మహిళలు, వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ విద్యాచందన, డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, డీఈఓ వెంకటేశ్వరాచారి, జెడ్పీటీసీ రామక్క, తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ సత్యనారాయణ, సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్, ఎంఈఓ కృష్ణయ్య, వైద్యాధికారి మనేష్ రెడ్డి, వివిధ శాఖల ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలకు ప్రాధాన్యమిస్తాం

డీఎఫ్‌ఓ కృష్ణాగౌడ్



కిన్నెరసాని అటవీ ప్రాంతంలో వాచ్‌టవర్‌పై నుంచి పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ

ఇల్లెందురూరల్: వానరాలు తిరిగి అడవుల్లోకి చేరేలా వనమహోత్సవంలో పండ్ల మొక్కలు నాటేందుకు ప్రాధాన్యమిస్తామని ఎఫ్‌డీఓ కృష్ణాగౌడ్ తెలిపారు. మండలంలోని ఫారెస్టు అర్బన్ పార్క్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ దఫా వనమహోత్సవంలో 2,500 ఎకరాల్లో మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించామన్నారు. గతంలో నాటిన మొక్కల్లో చావు మొక్కలను గుర్తించి కొత్త మొక్కలను నాటుతామని తెలిపారు. ప్రస్తుతం అడవిలో పండ్ల మొక్కలు చాలా వరకు అంతరించిపోయినట్లు గుర్తించి గడిచిన మూడేళ్లుగా మంకీ ఫుడ్ కోర్టుల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పోడు భూముల సర్వే జరుగుతోందన్నారు. గతంలో పంపిణీ చేసిన భూభాగం కంటే అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్న ప్రాంతాల వివరాలు గుర్తించే పనిలో క్షేత్రస్థాయి సిబ్బంది నిమగ్నమయ్యారని తెలిపారు. భవిష్యత్తులో అటవీభూములు ఆక్రమణకు గురికాకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న, ఎఫ్‌ఆర్‌వో ప్రసాద్, డీఆర్‌వో రాంసింగ్, బీట్ అధికారి ఈరులాల్ తదితరులు పాల్గొన్నారు.

డీర్ పార్కు పరిశీలన
పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసాని డీర్ పార్కును, వాచ్ టవర్‌ను శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణాగౌడ్ పరిశీలించారు. పార్కులోని జింకల పోషణ, సంరక్షణపై వైల్డ్‌లైఫ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాచ్ టవర్‌పైకి ఎక్కి పరిశీలించారు. రిజర్వాయర్ పక్కన ఏర్పాటు చేసిన కుకూ జంగిల్ మెలోడీ పార్కును తనిఖీ చేశారు. డీఎఫ్‌ఓ వెంట ఎఫ్‌డీఓ బాబు, రేంజర్ శ్రీనివాసరావు, సిబ్బంది హారిక, రవి ఉన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్

ఇల్లెందురూరల్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్ సూచించారు. మండలంలోని కొమరారం పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. రోజువారీ ఓపీ, ఇన్‌పేషెంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రసవాల వివరాలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం పొందేలా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. జ్వరాలు విజృంభించకుండా గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించాలని చెప్పారు. గ్రామాల్లో ముప్పై ఏళ్ల వయసు పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ లోహిత, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్యాంపునకు గిరిజన విద్యార్థిని



విద్యార్థిని ఇందుతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

భద్రాచలంటౌన్: గిరిజన విద్యార్థిని క్రీడా ప్రతిభ చాటి జాతీయస్థాయి కోచింగ్ క్యాంపునకు ఎంపికైంది. భద్రాచలంలోని గిరిజన గురుకులంలో పదో తరగతి చదివే పడిగే ఇందు ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్, హై జంప్ తదితర క్రీడల్లో సత్తా చాటింది. నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్ (ఎన్‌ఐడీజేఏఎం)–24కు కోచింగ్ క్యాంపునకు అర్హత పొందింది. దేశంలో ఇలాంటి కోచింగ్ క్యాంపులు ఐదు రాష్ట్రాల్లో నిర్వహిస్తుండగా, భోపాల్ క్యాంపునకు ఇందు ఎంపికైంది. తెలంగాణ రాష్ట్రం నుంచి అండర్–14 విభాగంలో ఎంపిక కాగా, 15 రోజులపాటు క్యాంపునకు భోపాల్ బయల్దేరి వెళ్లింది. ఇందు హైదరాబాద్‌లో జరిగిన ఈఎంఆర్‌ఎస్ జాతీయ క్రీడల్లో, ఇంటర్ సొసైటీ లీగ్ క్రీడా పోటీల్లోనూ చాంపియన్‌గా నిలిచింది. విద్యార్థినిని శుక్రవారం భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్, అధికారులు టి.వెంకటేశ్వరరాజు, రవికుమార్, ఎం.దేవదాస్ తదితరులు అభినందించారు. కాగా విద్యార్థిని స్వగ్రామం లక్ష్మీదేవిపల్లి గట్టుమల్లె. తల్లిదండ్రులు సత్యనారాయణ, అనిత వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

గనుల వేలంపై నిరసన

- సింగరేణి సంస్థను నిర్వీర్యం చేయొద్దని వామపక్షాల ఆందోళన
- ట్రేడ్ యూనియన్లతో కలిసి కలెక్టరేట్ ముట్టడి
- 'సింగరేణి బచావో' ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష, ట్రేడ్ యూనియన్ల నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఉద్యమాల ద్వారా తిప్పికొట్టి బొగ్గు సంస్థలను కాపాడుకోవాలని వామపక్ష పార్టీలు, ట్రేడ్ యూనియన్ల నేతలు పిలుపునిచ్చారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సింగరేణి సంస్థకు బేషరతుగా అప్పగించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, అనుబంధ యూనియన్ల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. సింగరేణి కొత్తగూడెం రీజియన్ పరిధిలోని కొత్తగూడెం, కార్పొరేట్, మణుగూరు, ఇల్లెందు ఏరియాల నుంచి పార్టీల కార్యకర్తలు, కార్మికులు ఆందోళనకు భారీగా తరలివచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. కాగా ధర్నా నేపథ్యంలో పోలీసు బలగాలను అధికసంఖ్యలో మోహరించారు.

కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం
ధర్నానుద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు అవునూరి మధు, జాటోత్ కృష్ణ, ఏఐటీయూసీ నాయకులు మిర్యాల రంగయ్య, సీఐటీయూ నాయకులు మంద నరసింహారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు యాకూబ్‌షావలి, రాంసింగ్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించిందని, తాజాగా బొగ్గు పరిశ్రమను ప్రైవేట్‌పరం చేసే నిర్ణయం తీసుకుందని దుయ్యబట్టారు. కేంద్ర నిర్ణయంతో తెలంగాణలోని బొగ్గు బ్లాకులు అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులపరం కానున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులను తెలంగాణలోకి అడుగుపెట్టనీయబోమని స్పష్టం చేశారు. దేశసంపదతోపాటు కార్మికుల శ్రమను దోచుకునే చర్యలను కార్మికవర్గ ఉద్యమాలతోనే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకు ప్రైవేటీకరణతోనే కేంద్రం సరిపెట్టుకోదని భవిష్యత్‌లో సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తుందని ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణను అడ్డుకుంటేనే కార్మికుల హక్కులకు రక్షణ ఉంటుందని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. సింగరేణి పరిరక్షణ ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారుస్తామని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, డి.శంకర్, దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, జ వీరాస్వామి, వి.మల్లికార్జునరావు, ఎస్‌వీ రమణమూర్తి, వి పద్మజ, కె రాములు, సిఐటియు నాయకులు బి మధు, కె బ్రహ్మచారి, సత్య, వెంకటేశ్వర్లు, లక్ష్మి, పద్మ, విజయగిరి శ్రీనివాస్, భూక్యా రమేష్, న్యూడెమొక్రసీ ఎంఎల్, ఐఎఫ్‌టీయూ నాయకులు గౌని నాగేశ్వరరావు, మధుసూదన్‌రెడ్డి, వెంకటమ్మ, ముత్యాల సత్యనారాయణ, వైఎస్ రెడ్డి, మోత్కూరి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు

అశ్వాపురం: మినీ ఇండియాగా పిలుచుకునే అశ్వాపురం మండల కేంద్రంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో ఈ నెల 7వ తేదీ ఆదివారం నుంచి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు జరగనున్నాయి. కర్మాగారంలో వివిధ రాష్ట్రాల ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుండగా.. ఒడిశాలో జరిగే పూరీ జగన్నాథ రథయాత్రకు అనుసంధానంగా ఏటా ఇక్కడ రథయాత్ర నిర్వహిస్తారు. ఒడిశాకు చెందిన ఉద్యోగులతో ఏర్పడిన ఉత్కల్‌పతాగర్ సమితి ఆధ్వర్యాన ఈ నెల 7 నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు ఆద్యపూజతో మొదలయ్యే ఉత్సవాలు ఈ నెల 15న బాహుడా యాత్రతో ముగుస్తాయి.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి : పీఓ



వీసీలో పాల్గొన్న పీఓ రాహుల్, అధికారులు

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం జన్‌ధన్‌లో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో మిగిలిన కుటుంబాల వివరాలు సేకరించాలన్నారు. అలాగే, ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో మొక్కలు నాటాలని, కొత్తగా టైం టేబుల్ ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటలకే తరగతులు ముగుస్తున్నందున సాయంత్రం వరకు పిల్లలను చదివించడానికి సబ్జెక్టు టీచర్ల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అలాగే, గిరిజన గ్రామాల్లోని అటవీ ప్రాంతంలో అభివృద్ధి పనులకు ఎదురవుతున్న అడ్డంకులపై వివరాలు సమర్పించాలని తెలిపారు. ఇక సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున 24 గంటల పాటు ఏఎన్‌ఎం విధుల్లో ఉండాలని పీఓ స్పష్టం చేశారు. అధికారులు డేవిడ్‌రాజ్, మణెమ్మ, తానాజీ, వెంకటేశ్వరరాజు, నరేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని వసతులు
గిరిజన పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడమే కాక మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందిస్తామని ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీఓ పాల్గొని మాట్లాడారు.

రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా 'కొత్వాల'



కొత్వాలను సత్కరిస్తున్న చైర్మన్ తదితరులు

పాల్వంచ: రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఎక్స్ అఫీషియో డైరెక్టర్‌గా ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న రాయల శేషగిరిరావుపై కొన్నాళ్ల కిందట అనర్హత వేటు పడగా, వైస్ చైర్మన్ శ్రీనివాసరావుకు పదవి అప్పగించారు. కాగా, మార్క్‌ఫెడ్ ఎక్స్ అఫీషియో డైరెక్టర్‌గా కొనసాగిన శేషగిరిరావు ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ పదవిలో కొత్వాలను నియమించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఎండీ సీహెచ్ సత్యనారాయణరెడ్డి తదితరులు సత్కరించారు. కాగా, తన నియామకానికి సహకరించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు కొత్వాల కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ఆరేళ్ల బాలికపై లైంగికదాడి

ఇల్లెందురూరల్: మండలంలోని రాఘబోయిన గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఆరేళ్ల బాలికపై సమీప బంధువైన పద్దెనిమిదేళ్ల యువకుడు శుక్రవారం లైంగికదాడికి పాల్పడ్డాడు. సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. పొలం పనులకు వెళుతూ బాలికను ఇంటి వద్ద కాపలా ఉంచారు. ఇంట్లో ఎవరూలేరని గమనించిన యువకుడు బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులకు బాలిక రోదిస్తూ జరిగిన విషయం తెలిపింది. వెంటనే స్పందించిన తల్లిదండ్రులు ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించగా.. లైంగికదాడి జరిగినట్లుగా వైద్యులు నిర్ధారించారు. యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సత్యనారాయణ వివరించారు.

హైవే హద్దుల ఏర్పాటు అడ్డగింత

రఘునాథపాలెం: నాగపూర్ – అమరావతి హైవే నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టు సంస్థప్రతినిధులు శుక్రవారం హద్దుల నిర్ధారణకు వచ్చారు. మండలంలోని వీ.వీ.పాలెం సాగర్ ప్రధాన కాల్వకు ఎడమవైపు సర్వే చేస్తున్నట్లు తెలుసుకున్న నిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. ఈ అంశంపై హైకోర్టులో స్టే ఉండగా ఎలా సర్వే చేస్తున్నారని నిలదీయడంతో సిబ్బంది వెనుతిరిగారు.

ఎఫ్‌బీఓపై వరకట్న వేధింపుల కేసు

కారేపల్లి: అదనపు కట్నం తీసుకరావాలని భార్యను వేధిస్తున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్‌పై కారేపల్లి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని పైల్‌తండా గ్రామానికి చెందిన సౌందర్యకు, ఏన్కూర్ మండలం ఎర్రబోడు తండాకు చెందిన ఎఫ్‌బీఓ భూక్యా మల్సూర్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, ఇటీవల అదనపు కట్నం తీసుకురావాలని మల్సూర్‌తో పాటు మరో నలుగురు కుటుంబ సభ్యులు సౌందర్యను ఇబ్బంది పెడుతుండగా ఈనెల 2న ఆమెను భర్త తీవ్రంగా కొట్టి గెంటేశాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదుతో భర్త సహా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

నకిలీ బంగారం ముట్టచెప్పి రూ.5 లక్షలు స్వాహా

నేలకొండపల్లి: అసలు బంగారమని నకిలీది అప్పగించిన ఓ వ్యక్తి రూ.5లక్షలు స్వాహా చేశాడు. నేలకొండపల్లి మండలంలోని ఓ గ్రామానికి ఏపీకి చెందిన బంగారం వ్యాపారి ఇటీవల వచ్చాడు. ఇక్కడ పలువురితో పరిచయాలు ఏర్పడగా గ్రామ యువకుడికి తక్కువ ధరకు బంగారం విక్రయించాడు. అంతేకాక తనకు బంగారం దుకాణం ఉందని... అక్కడికి వస్తే రూ.5లక్షలకే కిలో బంగారం ఇస్తానని నమ్మబలికాడు. దీంతో సదరు యువకుడు అందిన కాడికల్లా అప్పులు చేసి రూ.5 లక్షలు తీసుకెళ్లి ఆ వ్యాపారికి చెల్లించి బంగారం తీసుకొచ్చాడు. తీరా ఇక్కడకు వచ్చాక అది నకిలీ బంగారమని తేలడంతో లబోదిబోమంటూ ఫిర్యాదు చేసేందుకు ఏపీకి బయలుదేరినట్లు తెలిసింది.

లివర్ సమస్యతో ఉబ్బిన కడుపు



అహ్మద్‌కు చికిత్స చేస్తున్న డాక్టర్ రాంనివాస్

ఇల్లెందు: మండలంలోని రేపల్లెవాడకు చెందిన 28 ఏళ్ల అహ్మద్ తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. లివర్ సంబంధిత సమస్య రావడంతో ఆర్థిక పరిస్థితుల కారణంగా సరైన వైద్యం చేయించుకోలేదు. దీంతో కడుపు నిండా నీరు చేరి కుండ మాదిరిగా ఉబ్బింది. నానాటికీ ఇది పెరుగుతుండడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ డాక్టర్ రాంనివాస్ ఆయనను పరీక్షించి కడుపులో నీరు తొలగించకపోతే ప్రమాదమని చెప్పి చికిత్స ప్రారంభించారు. కడుపులోని నీరంతా బయటకు తీసి, పరిస్థితి మరింత విషమిస్తే కొత్తగూడెం లేదా ఖమ్మం తరలించాల్సి ఉంటుందని తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

మధిర: మధిర–మోటమర్రి రైల్వేస్టేషన్ల మధ్య వెళ్తున్న గూడ్స్ రైలు కిందపడి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి(30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు గులాబీ రంగు షర్టు, నీలం రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉండగా, ఆయన కుడిచేతిపై అమ్మ, నాన్న అని పచ్చబొట్టు ఉందని జీఆర్పీ ఔట్ పోస్ట్ ఇన్‌చార్జ్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కాగా, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుల సహకారంతో మార్చురీకి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు 87126 58589 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

జునోసిస్ వ్యాధులతో జాగ్రత్త

- జంతువుల పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి
- అవగాహన, వ్యాక్సినేషన్ తప్పనిసరి అంటున్న వైద్యులు
- లేకపోతే వైరస్, బ్యాక్టీరియాల ద్వారా వ్యాధుల వ్యాప్తి

నేడు ప్రపంచ జునోసిస్ డే

మూగజీవాలపై నానాటికీ సమాజంలో ప్రేమ పెరుగుతోంది. గతంతో పోలిస్తే ఇళ్లలో శునకాలు, ఇతర జీవాలను పెంచుకునే వారి సంఖ్య ఎక్కువేనని చెప్పాలి. కొందరు ప్రేమతో.. ఇంకొందరు స్టేటస్ సింబల్‌గా వీటిని పెంచుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా జీవాల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోకున్నా.. సరైన అవగాహన లేకున్నా వ్యాధులు సంక్రమించే ముప్పు పొంచి ఉన్నట్లే. ఈ నేపథ్యాన జీవాలకు వ్యాక్సిన్లు ఇప్పించడంతో పాటు ఇతర జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. నేడు (శనివారం) ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా కథనం.

–భద్రాచలంఅర్బన్/ఖమ్మంవ్యవసాయం



పెంపుడు కుక్కతో చిన్నారులు

ఏటా జూలై 6న..

జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సోకే వ్యాధులను జునోసిస్ వ్యాధులు అంటారు. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటి సారిగా 1885 జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి టీకా వేసి పునర్జన్మ ప్రసాదించిన సందర్భంగా ఏటా ఇదే రోజు జునోసిస్ డేగా నిర్వహిస్తున్నారు. జునోసిస్ వ్యాధుల్లో 200 రకాలు ఉన్నట్టు గుర్తించగా.. మొత్తం అంటువ్యాధుల్లో ఇవే 60 శాతమని అంచనా. ఇక రాష్ట్ర పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో జునోసిస్ వ్యాధులపై అవగాహన కలిపిస్తోంది. అంతేకాక పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తారు.

జాగ్రత్తలు తప్పనిసరి

సమాజంలో జంతు ప్రేమ రోజురోజుకూ పెరుగుతోంది. అయితే, జీవాల పెంపకంపై దృష్టి సారిస్తున్న వారు వాటితో వచ్చే వ్యాధులను పట్టించుకోవడంలేదు. ఈ నేపథ్యాన ప్రధానంగా పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చిన్నారులు బయట తిరగకుండా చూసుకోవాలి. పెంపుడు కుక్కలు బయట తిరిగే సమయాన ఇతరులపై దాడి చేయకుండా యజమానులు జాగ్రత్త పడాలి. అంతేకాక పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ తప్పక చేయించాలి. అలాగే, పెంపుడు జంతువులు, కోళ్లతో సన్నిహితగా మెలిగే వాళ్లు సైతం వ్యాధులపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రధానంగా వ్యాపించే వ్యాధులు

జునోసిస్ వ్యాధుల్లో పలు రకాలు ఉన్నాయి. ఇందులో ప్రధానమైనది రేబిస్. పిచ్చికుక్క కాటు ద్వారా వ్యాప్తి చెందే ఈ వ్యాధి లక్షణాలు కుక్క కరిచిన వారంనుంచి పది రోజుల్లో కనిపిస్తాయి. ఈ వ్యాధి సోకిన వారు గుటక వేయలేకపోగా, దాహం వేస్తున్నా నీళ్లు తాగ మంటే భయపడతారు. ఈ మేరకు కుక్క కరిచిన వెంటనే ఆ భాగాన్ని సబ్బుతో శుభ్రంగా కడిగి తగు చికిత్స చేయించుకోవాలి. అలాగే, పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయిస్తే ఇబ్బంది ఉండదు. ఇక రేబిస్, జపనీస్ ఎన్సెఫిలైటిస్ (మెదడువాపు), హైపటైటిస్, అమ్మవారు, డెంగీ, కొక్కెర, ఆంత్రాక్స్ తదితరాలు సైతం జునోసిస్ వ్యాధుల జాబితాలో ఉన్నాయి.

వైద్యుల సలహాలు తప్పనిసరి



జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే ఎబోలా, బర్డ్ ఫ్లూ, రేబిస్, మెదడువాపు వ్యాధుల విషయంలో జాగ్రత్త వహించాలి. వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వెటర్నరీ వైద్యుల సలహాలు తీసుకోవాలి. ఇంట్లో కుక్కలు పెంచే వారు వ్యాక్సిన్ తప్పనిసరి వేయించాలి.

–డాక్టర్ పురందర్, భద్రాద్రి జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

వ్యాధులను నివారించవచ్చు..



జునోసిస్ వ్యాధులు చాలా రకాలు ఉన్నా చాలా వాటితో ప్రమాదం తక్కువగానే ఉంటుంది. అయితే, ప్రజల్లో ఆరోగ్య విజ్ఞానంపై అవగాహన అవసరం. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. అలాగే, రక్షిత మంచినీరు, జంతువులను శాస్త్రీయ పద్ధతిలో పోషిస్తే సమస్యలు రావు.

–డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఇన్‌చార్జ్ ఏడీఏ, భద్రాచలం

అజాగ్రత్త వహించొద్దు



పెంపుడు జంతువులు ఉన్న ప్రతీఒక్కరు జునోసిస్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి. తరచుగా వైద్యులను సంప్రదిస్తూ సమయానుగుణంగా పెంపుడు జీవాలకు వ్యాక్సిన్లు వేయించాలి. ఇంట్లో చిన్నపిల్లలు ఉంటే మరింత జాగ్రత్త వహిస్తే ఇబ్బంది ఉండదు.

–డాక్టర్ వి.అరుణ, ఏడీ, ఖమ్మం పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

పోడు పేరుతో అడవి నరికివేత



అడవిని నరుకుతున్న గిరిజనులు

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామంలో మళ్లీ పోడు ఉద్యమం మొదలైంది. గ్రామానికి చెందిన 20 మంది గిరిజనులు శుక్రవారం అడవిలోకి ప్రవేశించి పోడు నరకడం ప్రారంభించారు. ఇప్పటికే పోడు భూములకు సంబంధించి పోడు పట్టాలు జారీ చేశామని, ఇకపై అడవులు నరికితే కఠిన చర్యలుంటాయని ఓ వైపు అటవీ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు పోడు నరికివేత యథేచ్ఛగా సాగుతోంది. తమకు ఎలాంటి భూములు లేవని, పోడు నరికి వ్యవసాయం చేసుకుంటామని గిరిజనులు చెబుతున్నారు. ఇప్పటికే అడవులు పలుచపడ్డాయని, ఇదే తరహాలో పోడు పేరిట అడవులను నాశనం చేస్తే పర్యావరణ పరిరక్షణ సాధ్యం కాకపోవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

కత్తితో దాడి చేసిన మహిళ అరెస్ట్

కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్‌కు చెందిన చాపలమడుగు శిరీషపై కత్తితో దాడి చేసి గాయపరిచిన నిందితురాలు, అదే ప్రాంతానికి చెందిన పావనిని శుక్రవారం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారు వివరాలు వెల్లడించారు. పావని.. తన భర్త అయిన దుర్గాప్రసాద్‌తో శిరీష (దుర్గాప్రసాద్, శిరీష చిన్ననాటి స్నేహితులు) మాట్లాడుతోందని అనుమానం పెంచుకుంది. శిరీషను అడ్డు తొలగించుకోవాలని భావించి పావని.. ఎవరూ లేని సమయంలో శిరీషపై కత్తితో దాడిచేసి, తీవ్రంగా గాయపర్చింది. శిరీష భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పావనిని అరెస్ట్ చేశామని, ఆమె దాడి చేసినట్లు ఒప్పుకుందని, ఆమెపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ రమేశ్‌కుమార్ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేశ్‌కుమార్

హైవే హద్దుల ఏర్పాటు అడ్డగింత

రఘునాథపాలెం: నాగపూర్– అమరావతి హైవే నిర్మాణానికిసంబంధించి కాంట్రాక్టు సంస్థ ప్రతి నిధులు శుక్రవారం హద్దుల నిర్ధారణకు వచ్చారు. మండలంలోని వీ.వీ.పాలెం సాగర్ ప్రధాన కాల్వకు ఎడమవైపు సర్వే చేస్తున్నట్లు తెలుసుకున్న నిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. ఈ అంశంపై హైకోర్టులో స్టే ఉండగా ఎలా సర్వే చేస్తున్నారని నిలదీయడంతో సిబ్బంది వెనుతిరిగారు.

అదుపుతప్పి లారీ బోల్తా..



క్రూడాయిల్ తీసుకెళ్లడానికి వచ్చిన స్థానికులు

దమ్మపేట: అతివేగంగా వెళ్తున్న ట్యాంకర్ (లారీ) అదుపుతప్పి బోల్తాపడిన ఘటన మండలంలోని మొద్దులగూడెం గ్రామశివారులో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వంట నూనె సంబంధిత క్రూడ్ ఆయిల్ ట్యాంకర్ కాకినాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారుజామున డ్రైవర్ అతివేగంతో నడుపుతుండగా మొద్దులగూడెం గ్రామశివారు మూలమలుపు వద్ద బోల్తా కొట్టి గోతిలో పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు, లారీ నుంచి కారుతున్న క్రూడ్ ఆయిల్‌ను బకెట్లు, వాటర్ క్యాన్లు, బాటిళ్లలో నింపుకుంటుండగా చేరుకున్న పోలీసులు.. ప్యూరిఫైడ్ కాని ఆయిల్ వంటకు పనికిరాదని వారిని పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

ఎస్పీకి ఫిర్యాదు

కొత్తగూడెంటౌన్: పాల్వంచకు చెందిన జర్నలిస్టు ఎంఏ రజాక్‌పై చేయి చేసుకున్న కొత్తగూడెం డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం టీయూడబ్ల్యూజే (143) టీజేఎఫ్ ఆధ్వర్యంలో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (143)టీజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షఫీ మహ్మద్ ఎస్పీకి ఘటన వివరాలు వెల్లడించారు. ఒక కేసు విషయంలో డీఎస్పీ ఆఫీస్‌కు వెళ్లిన పాల్వంచకు చెందిన విలేకరి (సాక్షి కాదు)పై డీఎస్పీ దుర్భాషలాడుతూ కొట్టాడని చెప్పారు. స్పందించిన ఎస్పీ ఈ విషయమై విచారణ చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

మణుగూరుటౌన్: చెక్‌బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ మణుగూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి సూరిరెడ్డి శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాలిలా ఉన్నాయి.. గుత్తుల శ్రీనివాసరావు వద్ద సుందరయ్యనగర్‌కు చెందిన చింతల రాజారాం 2015లో రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చాలా రోజుల తర్వాత రూ.3 లక్షలకు చెక్కు ఇచ్చాడు. దానిని శ్రీనివాసరావు బ్యాంకులో జమచేయగా బౌన్స్ అయింది. దీంతో బాధితుడు తన న్యాయవాది ద్వారా కోర్టులో కేసు దాఖలు చేయగా సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి.. చింతల రాజారాంకు రూ.3 లక్షల జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. న్యాయవాదులుగా ఎస్వీ రమణారెడ్డి, బద్దం శ్రీనివాసరెడ్డి వాదించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుమ్ముగూడెం: మండలంలోని యం.కాశీనగరం గ్రామానికి చెందిన చింతం హెబినైజర్ (42) కలుపుమందు తాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని హెబినైజర్ భార్య సలోమిని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు హెబినైజర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి బయట కూర్చోబెట్టారు. అప్పటికే తన వెంట తెచ్చుకున్న కలుపుమందును హెబినైజర్ తాగడంతో పోలీసులు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. మృతుడి అన్నయ్య చింతం జాన్‌వెస్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కేశవరావు తెలిపారు.

గుండెపోటుతో రైతు...

దుమ్ముగూడెం: మండలంలోని అంజిపాక గ్రామానికి చెందిన రైతు మడకం ఆదినారాయణ (35) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆదినారాయణ గురువారం సాయంత్రం పొలంలో వదిలిన నాగలి ఇంటికి తీసుకుని రావడానికి వెళ్లాడు. ఈ క్రమంలో గుండెపోటుకు గురై పొలంలోనే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన ఆదినారాయణ శుక్రవారం కూడా ఇంటికి రాకపోవడంతో మృతుడి మామయ్య ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. విషయాన్ని గ్రామస్తులకు తెలిపి మృతదేహాన్ని ఇంటికి చేర్చారు.

డయాలసిస్ కోసం వచ్చిన కార్మికుడు మృతి

సింగరేణి మెయిన్ ఆస్పత్రి నిర్వహణ లోపమే కారణమా?



యాకూబ్‌ఖాన్ మృతదేహం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకునేందుకు వచ్చిన, ఇల్లెందు ఓసీలో పనిచేస్తున్న ఎండీ యాకూబ్‌ఖాన్ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రెండు నెలల కిందట యాకూబ్‌ఖాన్ హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. డిశ్చార్జ్ సమయంలో వారంలో మూడు రోజులు కొత్తగూడెంలోని కంపెనీ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం స్వయంగా నడుచుకుంటూ వచ్చిన యాకూబ్‌ఖాన్ డయాలసిస్ చేయించుకుంటుండగా అస్వస్థతకు గురయ్యాడు. ఆయన్ను క్యాజువాలిటీకి పంపించకుండా వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేశారని, దీంతోనే యాకూబ్‌ఖాన్ మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతదేహాన్ని సందర్శించిన ఏఐటీయూసీ నాయకులు వంగా వెంకట్, వీరస్వామి మాట్లాడుతూ.. సింగరేణి ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రైవేట్ వ్యక్తులతో నడిపించడం దురదృష్టకరమన్నారు. డయాలసిస్ సెంటర్లో క్రిటికల్ యూనిట్ లేదని, నెఫ్రాలజిస్ట్ లేకుండా డయాలసిస్ నడిపించటం సరైంది కాదని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగికి సరైన వైద్యం అందించటంలో వైద్యులు విఫలమయ్యారని, సీఎండీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బాధ్యులైనవారిపై చర్యలు తీసుకునేంత వరకు ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కార్మికుడి మృతికి డయాలసిస్ సెంటర్ వారే పూర్తి బాధ్యత వహితంచాలని డిమాండ్ చేశారు. కాగా, మృతుడికి ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారు.

‘గూడెం’ చుట్టూ ఔటర్..

- ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు
- రూ.450 కోట్ల వ్యయంతో అంచనాలు
- నిర్మాణం పూర్తయితే తొలగనున్న ట్రాఫిక్ ఇక్కట్లు
- అన్ని రంగాల్లో పట్టణాభివృద్ధికి అవకాశం




కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణానికి ఔటర్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేసేందుకు నేషనల్ హైవే అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. 25 – 30 కిలోమీటర్ల మేర నిర్మించాల్సిన ఈ రోడ్డుకు రూ.450 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. కొత్తగూడెం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు మంజూరైతే జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పనున్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి నుంచి సర్వారం, హౌసింగ్ బోర్డు మీదుగా రామవరంలోని రేడియో స్టేషన్ వరకు, అక్కడి నుంచి పాత బైపాస్ ద్వారా పాల్వంచ మండలం తోగ్గూడెం, లక్ష్మీపురం మీదుగా భద్రాచలం ఎన్‌హెచ్–30 రోడ్డుకు కలిపేలా ప్రణాళిక రూపొందించారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇల్లెందు నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు కొత్తగూడెం రాకుండా నేరుగా అనిశెట్టిపల్లి నుంచి సర్వారం మీదుగా ఖమ్మం రోడ్డువైపు వెళ్తాయి. ఖమ్మం నుంచి వచ్చే వాహనాలు కొత్తగూడెం రాకుండా రామవరం రేడియో స్టేషన్ మీదుగా పాత బైపాస్ కలుపుకొని పాల్వంచలోని లక్ష్మీపురం, భద్రాచలం రోడ్డుకు వెళ్తాయి. విజయవాడ నుంచి భద్రాచలం వెళ్లే వాహనాలు కొత్తగూడెం రాకుండా రామవరం రెడియో స్టేషన్ నుంచి పాత బైపాస్ మీదుగా పాల్వంచలోని తోగ్గూడెం, భద్రాచలం ఎన్‌హెచ్‌కు కలుస్తాయి. అయితే, కొత్తగూడెం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు మంజూరైతే కొత్తగూడెం పట్టణంతోపాటు చుట్టు పక్క పల్లెలు ఎంతో అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు.

రాత్రి వేళల్లో భారీ వాహనాలు

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, వైజాగ్, విజయవాడతోపాటు హైదరాబాద్, సూర్యాపేట, ఖమ్మం ఇతర ప్రాంతాల నుంచి రాత్రి వేళల్లో పెద్ద లారీలు వచ్చి పోస్టాఫీస్ సెంటర్ వద్ద నిలుస్తున్నాయి. రాత్రి పది గంటల తరువాత ఈ లారీలను ట్రాఫిక్ పోలీసులు ఎంజీరోడ్డు మీదుగా రాకపోకలకు అనుమతి ఇస్తారు. దీంతో ప్రతిరోజూ రాత్రి పది దాటిన తరువాత భారీ సంఖ్యలో లారీలు ఎంజీ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు మంజూరైతే ఈ ఇబ్బందులు తప్పుతాయని ప్రజలు చెబుతున్నారు.


నిధులు త్వరగా మంజూరు చేయాలి



ఔటర్ రింగ్ రోడ్డుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. తద్వారా కొత్తగూడెంనకు భారీ వాహనాలు రాకుండా బైపాస్‌లో వెళ్తాయి. ఈ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం ద్వారా కొత్తగూడెం, చుట్టు పక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. గూడెం ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయి.

–కొండూరి సాయికుమార్, కొత్తగూడెం

ట్రాఫిక్ చిక్కులు తొలగుతాయి



ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ చిక్కులు తొలగుతాయి. ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు సమయానికి వారి గమ్యాలకు చేరుకోలేకపోతున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి.

–రాజేశ్‌కన్నా, సామాజికవేత్త